క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సాధిక్ పాషా

ఇల్లెందు: నాలుగో తరగతి ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధిక్ పాషా తెలిపారు. ఆదివారం ఇల్లెందు మెయిన్‌రోడ్ హైస్కూల్‌లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎండి.ముస్తాఫా, ఉపాధ్యక్షుడిగా గౌస్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా భూపాల్, సహాయ కార్యదర్శిగా మంజుల, చైతన్య, వెంకన్న, సభ్యులుగా కనుక దుర్గ, రాంబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమాదేవి, మహబూబ్, అక్బర్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీకే-7 ఓసీకి అనుమతులు ఇప్పించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీకి త్వరగా రెండో దశ అనుమతులు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోరారు. ఆంతోటి నాగేశ్వరరావు కోరారు. కొత్తగూడెంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ ఆధ్వర్యాన గత ఏడాది కేంద్ర మంత్రులను కలవగా వీకే-7 ఓసీకి స్టేజ్-1 అనుమతులు వచ్చాయని, ఇదే క్రమంలో రెండో దశ అనుమతులు కూడా జారీ చేస్తే వేలాది కార్మికులకు మేలు జరగడంతో పాటు ఏరియాకు పూర్వవైభవం వస్తుందని తెలిపారు. ఈ విషయమై యాజమాన్యం, అధికారులు చొరవ చూపాలని కోరారు. నాయకులు జిమ్మిడి మల్లేష్, పొనగంటి అంకూస్, మోరే రమేష్‌కుమార్, మొగిలిపాక రవి, సుదర్శన్, గజ్జి శ్రీనివాస్, శ్రీహరి పాల్గొన్నారు.

డొంక దారికి మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నరసింహారావు

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడులో మంగళగిరి డొంక దారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నారుపాడు నుంచి పొలాలకు వెళ్లే మంగళగిరి డొంక దారి అధ్వానంగా ఉండటంతో రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా ఈ దారిలో రైతులు, కూలీలు నడిచే పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, గుమ్మా రోశయ్య, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులు

పాల్వంచ: ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం నందు నిర్వహించి కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్వంచలోని కొత్తగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ప్రతిభ కనబర్చారు. ఈమేరకు ఆదివారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, పీడీ స్పందన, ఉపాధ్యాయులు విద్యార్థినిలను అభినందించారు. పదివేల మీటర్ల పరుగు పందెంలో, 5 వేల మీటర్ల పరుగు పందెంలో పాయం ఉషారాణి స్వర్ణ పతకాలు సాధించింది. అదేవిధంగా 1,500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెల్లో ఎం.టాబు రజత పతకాలను సాధించింది.

తారుపోయి.. గుంత మిగిలే!

అధ్వానంగా దమ్మపేట రోడ్డు

- తగులుతున్న రాళ్లు.. కళ్లల్లో పడుతున్న దుమ్ము
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు



గుంతలమయంగా మారిన దమ్మపేట రోడ్డు



తారు కొట్టుకుపోయి పైకి తేలిన రాళ్లు

పాల్వంచ: పాల్వంచలోని దమ్మపేట క్రాస్ రోడ్డు నుండి కుంటినాగులగూడెం వరకు రహదారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ వర్షాకాలంలో గుంతలు మరింత పెద్దవిగా మారి నిత్యం ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. నిత్యం అటుగా తిరిగే స్థానికులు, ప్రయాణికుల అవస్థలు అంతా ఇంతా కాదు. అనేక చోట్ల గుంతలు పడి రాళ్లు తేలి తగులుతున్నాయి. ఇక రాకపోకలతో దుమ్ములేవడంతో వెనుక వచ్చే వాహనాలకు, ద్విచక్ర వాహనదాల కళ్లల్లో పడి ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని పూడ్చాలని అనేక మార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకున్న వారు కరువయ్యారు.

ఆగని ప్రమాదాలు..

ఈ రోడ్డులో వాహనదారులు ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే. ఎప్పుడు ఈ రోడ్డు గుంతలు దాటుతామనా అని హైరానా పడుతుంటారు. కుంటినాగూలగూడెం దాటితే తప్పా ఊపిరిపీల్చుకోని పరిస్థితి. వాహనాలు గుల్లవుతుండటంతో పాటు, కళ్లల్లో దుమ్ము, ఎక్కడ ప్రమాదం సంభవిస్తోందో అనే భయం వెంటాడుతుంటాయి. వర్షాకాలంలో గుంతలు మరింతగా పెరిగాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా అంతే..



ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఇటీవల ములకలపల్లి మండలం పూసుగూడెం పంచాయతీ ఓడ్డు రామవరంలో మిషన్ భగీరథ పనుల పరిశీలనకు వచ్చిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా వెంటనే మంత్రి సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా కుంటినాగులగూడెం సమీపంలో మినీ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఈ రోడ్డు గుండా వెళ్లాల్సి రావడంతో అప్పటికప్పుడు గంట ముందు జేసీబీతో రోడ్డు గుంతలు లేకుండా అక్కడక్కడ సమానంగా మట్టిని నెట్టారు. రోడ్డు దుస్థితిని మంత్రి స్వయంగా పరిశీలించారు. ఇక స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి సైతం అనేక మార్లు తీసుకెళ్లారు. అయినా ఈరోడ్డు పరిస్థితి మారక పోవడం గమనార్హం.

గుంతలతో ఇబ్బంది పడుతున్నాం..



పాల్వంచ నుంచి ములకలపల్లికి వెళ్లే దమ్మపేట రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని సంవత్సరాలుగా రాకపోకలకు ఇబ్బందిపడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా అదికారులు స్పందించాలి.

– నంబూరి రామకృష్ణ, స్థానికుడు

అధికారులు దృష్టి సారించాలి



ఈ రోడ్డులో వెళ్లాలంటే ఇబ్బంది కరంగా మారింది. గుంతల్లో రాళ్లు తేలి ఎప్పుడు ఎటువైపు నుంచి ప్రమాదం సంభవిస్తోందో అర్థం కావడం లేదు. గతంలో ప్రజా ప్రతినిధుల దృష్టికి అనేక మంది తీసుకెళ్లినా అధికారులు వారి ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించాలి.

– కె.వెంకటేశ్వర్లు

సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏజే రమేష్

టేకులపల్లి: మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అందుగులగూడెంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పత్తి క్వింటాకు రూ.8 వేలు ఇవ్వాలని, మండలంలో పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. తేమ శాతం పేరుతో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, పది వేల ఎకరాల భూముల్లో పత్తి పంట పండిస్తున్నారని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఈసం నరసింహారావు, మండల కమిటీ సభ్యులు కడుదుల వీరన్న, పూనెం స్వామి, కుంజ రమేష్, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సావిత్రి, దనసర వీరాస్వామి పాల్గొన్నారు.

మెస్‌చార్జీల పెంపుపై హర్షం



ప్లకార్డులతో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: గురుకుల హాస్టళ్ల మెస్‌చార్జీల పెంపుపై కొత్తగూడెంలోని గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రమ్మ, అధ్యాపక బృందం, విద్యార్థులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెస్‌చార్జీల పెంపు కోసం ఏడు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నామని, గురుకుల హాస్టళ్లలో 40 శాతం మెస్‌చార్జీల పెంపును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. చార్జీల పెంపుతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడిసిన మొక్కజొన్న కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందురూరల్: అకాల వర్షంతో తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు బానోత్ సంతు, మూడు మాలు, వాంకుడోత్ మోతీలాల్, భద్రయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో అకాలవర్షంతో తడిసిన మొక్కజొన్నను పార్టీ బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా రైతులను మోసం చేసిందని, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు కల్లాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న అకాల వర్షంతో పూర్తిగా తడిసిపోయిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎలాంటి షరతులు లేకుండా తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాగేష్, లక్ష్మణ్, బొద్యా తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన మహిళపై చర్య తీసుకోవాలి

పాల్వంచ: అక్రమంగా చిట్టీలు, బ్యాంక్ షురిటీలు పెట్టించుకుని ఇబ్బందులు గురి చేస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, బాధితులు ఝాన్సీ, జోతేంద్రలు ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఝాన్సీ వద్ద నుంచి కాంట్రాక్టర్స్ కాలనీకి చెందినఓ మహిళ చిట్టీ డబ్బులు, అప్పుగా తీసుకున్న రూ.15 లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేసిందని, అదేవిధంగా రూ.60 లక్షలకు కేటీపీఎస్ ఉద్యోగి ప్రభాకర్‌తో షురిటీ సంతకం పెట్టించి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందని, ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ సందర్భంగా అక్రమ చిట్టీలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరుల ఆశయ సాధనకు కృషి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న మధు



సింగరేణి(కొత్తగూడెం): అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా తుదకంటూ పోరాడిన అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. అమరవీరు సంస్మరణ వర్ధంతి వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో కోంద్రు భద్రయ్య స్థూపం వద్ద ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు ఎర్రజెండా గొప్పతనాన్ని వివరిస్తూ అమరులు చూపిన బాటలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.సీతారామయ్య, రాసుద్దీన్, ధనుంజయ్, సూర్నపాక నాగేశ్వరరావు, పార్వతి, వేంపల్లి వెంకటేశ్వర్లు, కోంద్రు సురేష్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మా అన్నారు. ఆదివారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అన్నారుపాడులో అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా దేశ విముక్తి, ఆదివాసీల హక్కులు, భూమి, భుక్తి కోసం పోరాడిన అమరవీరులకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బానోత్ వీరు, ధన్వంతరావు, వీరన్న, జగదీష్, చందు, నరేష్, సుజాత, కల్యాణ్, భీమా, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సోషలిస్ట్ సమాజాన్ని సాధించటమే అమర వీరులకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కమిటీ నాయకులు పెద్దబోయిన సతీష్ అన్నారు. ఈ మేరకు మాస్‌లైన్ డివిజన్ కమిటీ నాయకులు ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి సభలో అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజలపై జరుగుతున్న పెట్టుబడిదారీ దోపిడీని భూస్వాముల పెత్తందారుల అణచివేతను ఓడించాలన్నారు. నేడు రైతాంగానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర పాలకులు ఇవ్వటం లేదని రైతును నిండా ముంచుతున్నారని, రైతులకు సరైన గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి చరణ్, సాత్విక్, రమణ, మదన్, ముఖేష్, అభి, సౌజన్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలి

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తదితరులు

జూలూరుపాడు: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంటే శారీరక, మానసికంగా దృఢమవుతారని.. ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. జూలూరుపాడుకు చెందిన కల్లోజి రామారావు, విజయ్‌కుమార్, మురళీ ఆధ్వర్యాన వారి తండ్రి పాపయ్య, మిత్రుడు కమలం రామకృష్ణ జ్ఞాపకార్థం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన షటిల్ ఇండోర్ స్టేడియం ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. యువతకు క్రీడలపై ఆసక్తి పెంచేలా రూ.20లక్షల వ్యయంతో స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. ఎస్సై రాణాప్రతాప్‌తో పాటు వివిధ పార్టీలు, అసోసియేషన్ల నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, గుమ్మా రోశయ్య, మాలోత్ మంగీలాల్‌నాయక్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, నున్నా రంగారావు, దొండపాటి రమేష్, కొలిపాక వెంకటేశ్వర్లు, నున్నా కృష్ణయ్య, సర్వనేని పుల్లారావు, కొదుమూరి కోటేశ్వరరావు, లకావత్ లచ్చునాయక్, ధరావత్ రాంబాబు, గరికె శ్రీను, కల్లోజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా వ్యవహరించాలి



డిస్పెన్సరీ తనిఖీలో పరీక్షలు చేయించుకుంటున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: అనారోగ్యంతో హాస్పిటల్‌కు వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జీఎం జాన్ ఆనంద్ కోరారు. సింగరేణి జేకే ఏరియా డిస్పెన్సరీని ఏరియా జీఎం ఆదివారం తనిఖీ చేశారు. హాస్పిటల్‌లోని రోగులతో వారికి అందుతున్న వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాంప్ ప్రారంభం..

సింగరేణి జేకే హైస్కూల్ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపాన టెస్టింగ్ క్యాంప్‌ను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. ఇల్లెందు సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెండాను ఎగుర వేసిన జీఎం మాట్లాడుతూ... బాల బాలికల్లో దేశభక్తిని క్రమశిక్షణను పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటానికి క్యాంపు సహాయపడుతుందన్నారు. బాలుర బృందాలను స్కౌట్స్‌గా, బాలికల బృందాలను గైడ్స్ అంటారన్నారు. ఈ ఉద్యమంలో విద్యార్థులంతా స్వచ్ఛందంగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రగ్‌జోళ్ యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న లక్ష్మణ్ నాయక్

టేకులపల్లి: రాష్ట్రంలో ఈ నెల 26 నుంచి జరిగే రగ్‌జోళ్ యాత్రను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సెంట్రల్ కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్చంద్ నాయక్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో సేవాఘడ్ సేవాలాల్ గుడిలో సేవాలాల్ ధర్మ జాగరణ సేన సద్భావన సమావేశం నిర్వహించారు. సేవాఘడ్ సేవాలాల్ సేన గుడి నుంచి యాత్రలో పాల్గొనేందుకు భారీ ఎత్తున తండాల నుంచి తరలి రావాలని కోరారు. అనంతరం సేవాలాల్ సేన జిల్లా , అనుబంధ కమిటీ, మండల కమిటీ నాయకులను వివిధ పదవుల్లో నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను, బీజేపీ జిల్లా నాయకులు పూన్యా నాయక్, ధర్మజాగరణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు జరుపల రామచంద్రనాయక్, ధర్మ జాగరణ సేన ప్రధాన కార్యదర్శి జరపల మంగీలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఇల్లెందు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు వాంకుడోత్ రమేష్, పవన్ కళ్యాణ్, బోడ బాలు పాల్గొన్నారు.

బీఎస్పీ పోరాటాలతోనే డ్రైవర్లకు వేతనాలు



కామేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: బీఎస్పీ పోరాటాల వల్లే స్వచ్ఛభారత్ డ్రైవర్లకు జీతాలు ఇచ్చేందుకు అధికారులు ఒప్పుకున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులు, పౌరసమాజం ఆధ్వర్యంలో కామేష్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అక్టోబర్‌లో స్వచ్ఛభారత్ డ్రైవర్లు, హెల్పర్ల జీతాల కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగిందని, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ.గౌతమ్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌లను కలిసి కోరడంతో వేతనం నెలకు రూ.10 వేలు ఇచ్చేలా చర్యలు చేపట్టరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల జల్లారపు నాగేశ్వరరావు, ఇజ్జగాని రవిగౌడ్, ముత్తయ్య, బొల్లం భాస్కర్, కల్లోజి చంద్రశేఖర్, మురళీకృష్ణ, గోపాలకృష్ణ, ఉదయ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పాల్వంచరూరల్: 21 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు నాటి తరగతి గదిలో కలుసుకున్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం హైస్కూల్ 2002–2003 సంవత్సరం బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అనురాధ, చంద్రశేఖర్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆరుద్ర రమాదేవి, బొలిశెట్టి మాధవి, పాటిప్రసాద్, వెంకటచారి, వీరనారాయణతోపాటు కొండం పుల్లయ్య, బొలిశెట్టి లింగయ్య, నందనాయక్‌లు పాల్గొన్నారు.

వానరాల హల్‌చల్..

- పల్లెల్లో జీభత్సం సృష్టిస్తున్న కోతులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



సుజాతనగర్: కోతులు గ్రామాల్లో కిష్కింధకాండను సృష్టిస్తున్నాయి. గుంపులుగుంపులుగా సంచరిస్తూ హల్ చల్ చేస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రధానంగా సుజాతనగర్, సిరిపురం, నాయకులగూడెంతో పాటు ఆయా గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కోతులు చేస్తున్న చేష్టలతో ఆర్థికంగా నష్టపోతున్నారు. పదులు, వందల సంఖ్యలో ఒక్కసారిగా ఇళ్ల, షాపుల మీద పడి దాడి చేస్తున్నాయి. దండుగా ఇళ్లపై, దుకాణాల పైకప్పులు, పెంకులు, రేకులు తొలగిస్తున్నాయి. దీంతో పాటు ఇంట్లో ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సామగ్రిని ఎత్తుకుపోతున్నాయి. షాపుల్లో బలవంతంగా చొరబడుతూ తినే పదార్థాలను లాక్కెళ్తున్నాయి. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే ఎదురుదాడికి యత్నిస్తుండటంతో తమకు కోతుల నుంచి రక్షణ కరువైందని ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోకి చొరబడి చేతికి ఏది దొరికితే అది ఎత్తుకెళ్లి ధ్వంసం చేస్తున్నాయి. వానరాల దెబ్బకు ఆయా గ్రామాల్లో కూరగాయలు, పండ్ల చెట్లు, మొక్కలు పెంచుకునే పరిస్థితి లేదు. నిత్యం కోతులకాపలా కాయలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి బాధ భరించలేక చాలా మంది తమ షాపుల ఎదుట, ఇళ్ల కారిడర్ ఏరియాలో ఇనుప జాలీలను బిగించుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పవచ్చు. కోతుల బాధలు భరించలేక పంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న వారే లేరని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోతులను నియంత్రించి తమ సమస్యలు, బాధలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.